విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, ఫిబ్రవరి 2023

మితిమీరిన అధికార పార్టీ నాయకుల ఆగడాలు

- వైకాపాకు తొత్తులుగా పనిచేస్తున్న పోలీసులు
- అధికారం శాశ్వతం కాదు
- కొందరి పోలీసుల వైఖరి వ్యవస్థకే మచ్చ
- వైకాపా బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయం
- గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చీడపురుగు
- వైకాపా ప్రభుత్వంపై ధ్వజమెత్తిన జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్

విశాలాంధ్రబ్యూరో - అనంతపురం : ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని ప్రజలను ప్రాధేయపడిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించి రాష్ట్రంలో రౌడీ పాలన సాగిస్తున్నారని శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ వైకాపా ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మంగళవారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాజిల్లా గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై వైకాపా రౌడీ మూకలు దాడి దాడి చేసి అడ్డొచ్చిన కార్యకర్తలపై ఇష్టానుసారంగా కొట్టి ఫర్నిచర్ ను ధ్వంసం చేయడం దౌర్భాగ్యం అన్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ కు వెళితే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పట్టాభి పై గుర్తుతెలియని ముగ్గురు ముసుగు ధరించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎంతవరకు సమంజసమో తెలపాలని డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార పార్టీ నాయకుల ఆగడాలు మితి మీరి పోయాయని విమర్శించారు. రక్షణగా ఉండాల్సిన పోలీసులే ఒక పార్టీకి తొత్తులుగా ఉండడం సమంజసం కాదన్నారు. కొందరి పోలీసుల వైఖరి ఆ వ్యవస్థకే మచ్చ అని విమర్శించారు. వైకాపా కు కొందరు పోలీసులు తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. వైకాపా రౌడీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నాయకుల పై దౌడీ చేస్తే టీడిపి నాయకుల పైనే కేసులు బనాయించారని ఇది ఎంతవరకు సమంజసమో పోలీసులు గ్రహించుకోవాలని హితువు పలికారు. తెలుగుదేశం పార్టీ బీఫారం పై గెలిచిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కృతజ్ఞత భావన లేకుండా తన అనుచరుల ను రెచ్చగొట్టి తెలుగుదేశం పార్టీ నాయకుల పై దాడులకు పాల్పడే విధంగా ఉసిగొలుపు తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్నిటిని గమనిస్తున్నారని గన్నవరంలో వంశీకి గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా ను బంగాళాఖాతంలో కలిపేయడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

విశాలాంధ్ర - గుంతకల్లు : ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృ భాషను కూడా కాపాడుకోవాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు త్రిష్లా బన్సాలి అన్నారు. తిమ్మాపురం గ్రామంలో జడ్పీహెచ్ పాఠశాలలో ఆరవ తరగతి ఏడవ తరగతి విద్యార్థు లకు ఇన్నర్ విల్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి 60 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్స్ సర్టిఫికెట్లు అధ్యక్షురాలు త్రిష్లా బన్సాలి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష అని తల్లి ఒడే బిడ్డకు తొలిబడి అన్నారు. అమ్మ మాటే మాతృభాషని ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలని తెలిపారు.జీవితంలో పైకి ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోక తప్పదు కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాల న్నారు. మన మాతృభాషను రక్షించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మోహన్, ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు శాంతి పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీకి రక్తదానం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గం జరుట్ల రామపురం గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళగా అక్కడ పరీక్షించిన డాక్టర్లు తక్షణమే ఏ నెగటివ్ రక్తం ఎక్కించాలని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు వెంటనే ఆపద్బాంధవ స్వచ్ఛంద సంస్థ సభ్యులను సంప్రదించగా స్పందించిన ట్రస్ట్ నిర్వాహకులు తమ ట్రస్ట్ సభ్యులు అయిన విజయ్ కుమార్‌ను బుధవారం రక్త నిధి కేంద్రానికి పంపించి రక్తందానం చేయించారు.సకాలంలో రక్తం దానం చేసిన సభ్యులకి ఆపద్బాంధ ట్రస్ట్ నిర్వాహకులకు గర్భిణీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రథోత్సవం ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష

విశాలాంధ్ర - ఉరవకొండ : అనంతపురం జిల్లా ఉరవకొండలో వెలసిన గవి మఠ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం మార్చి 1,2 తేదీలలో జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం ఉరవకొండ తహసిల్దార్ కార్యాలయంలో గుంతకల్లు ఆర్డీవో రవీంద్ర, మఠం అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సంబంధిత శాఖ అధికారులను ఉద్దేశించి ఆర్డీవో మాట్లాడుతూ రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛ నీయ సంఘట నలు, దొంగతనాలు జరగకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టాలని రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చే భక్తులకు మఠం సిబ్బంది సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టాలని, వైద్య ఆరోగ్య శాఖ కూడా అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తాగునీటి సరఫరా శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. రథం యొక్క ఫిట్నెస్ కు సంబంధించి రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులుపర్యవేక్షణ చేయాలని, పట్టభద్రులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలని, రథోత్సవం పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ప్రచార కార్యక్రమాలు చేయరాదని, దీనికి నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్, రెవిన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని భక్తుల యొక్క రాకపోకలకు సంబంధించి ఆర్టీసీ సంస్థ కూడా అవసరమున్న ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆయన సూచించారు. అన్ని శాఖల యొక్క సహకారంతో రథోత్సవం, లంక దహనం కార్యక్రమాలు ప్రశాంతంగా విజయవంతంగా జరగడానికి కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఉరవకొండ తహసిల్దార్ షాబుద్దీన్, ఈఓఆర్డి దామోదర్‌రెడ్డి, ఎస్సై వెంకటస్వామి, డిప్యూటీ తహసిల్దార్ గురు ప్రసాద్, వీరితోపాటు రెవిన్యూ గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ మండలం లత్తవరం గ్రామ సమీపంలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలి పోతున్న 41 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యాన్ని బుధవారం ఉదయం విజిలెన్స్ సిఐ రామారావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ అక్షయను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ బియ్యం ఎవరివి ఎక్కడినుంచి ఎక్కడికి తీసుకెళుతున్నది పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈ వీరేంద్ర, ఉరవకొండ సిఎస్‌డిటి.రమేష్ బాబు పాల్గొన్నారు.

పార్వతి దేవి రథోత్సవమునకు ఆహ్వానం

విశాలాంధ్ర-విడపనకల్లు : మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో శ్రీ సుంకల పార్వతి దేవి రథోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉరవకొండ ఇన్చార్జ్ వై. విశ్వేశ్వర్ రెడ్డి మరియు యువనేత వై .ప్రణయ్ రెడ్డి ఈనెల 24వ తేదీన సుంకల పార్వతి దేవి రథోత్సవముకు పాల్తూరు ప్రజలు, మండల జడ్పీటీసీ హనుమంతు, కన్వీనర్ బసన్న, జేసిఎస్ కన్వీనర్ భరత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తిప్పయ్య, గ్రామ సర్పంచ్ బ్యాలారాణీ రాజశేఖర్, ఎంపిటిసిలు శివ, వేంకటేష్, డిష్ వేంకటేష్, షణ్ముఖగౌడ్ తదితరులు కలిసి రథోత్సవం ఆహ్వాన పత్రికలు అందజేశారు.

వైకాపా నాయకుడు తల్లి మృతికి సంతాపం

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల పరిధిలోని పోలికి గ్రామానికి చెందిన కురువ గాదేప్ప మరియు మారెప్ప తల్లి రామాంజనమ్మ(70) బుధవారం తెల్లవారుజామున మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు మృతదేహానికి నివాళులర్పించి, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించినవారిలో వైకాపా నాయకుడు కరణం భీమిరెడ్డి, ఎంపీటీసీ ఓబులేష్, నాయకులు ఉమాశంకర్, మాధవ రెడ్డి, దేవేంద్ర, గాజులవెంకటేష్, లాలెప్ప తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానికి వాలంటీర్లు, పార్టీకి కన్వీనర్లు, గృహసారథులే కీలకం

విశాలాంధ్ర - రాప్తాదు : ఏపీలో అన్ని వర్గాల ఆశాజ్యోతి సీఎం జగనేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండలంలోని సచివాలయాల పార్టీ కన్వీనర్లు, గృహ సారథులతో బుధవారం ఆత్మకూరులో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి అయిన తర్వాత నెరవే ర్చారన్నారు. దాదాపు ప్రతి కుటుంబానికి మేలు జరిగిం దని... మాట ఇస్తే నెరవేరుస్తాడన్న నమ్మకం ప్రజల్లో ఉంద న్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అని ప్రజలు భావిస్తున్నా రన్నారు. ఇదే నినాదంతో సచివాలయ కన్వీనర్లు, గృహసార థులు ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కొత్తగా నియమించిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు నాయకులు, వాలంటీర్లు ఇంటింటా తిరగాలన్నారు. గృహ సారథులకుప్రత్యేక కిట్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కిట్లలో గృహసారథులు ధరించడానికి ప్రత్యేక బ్యాడ్జీలు, ప్రజా మద్దతు పుస్తకాలు, కరపత్రాలు, మొబైల్ స్టిక్కర్లు, డోర్ స్టిక్కర్లు ఉంటాయన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజామద్దతు కోరాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలని తెలియజేశారు. ఎంపీపీ హేమలత,వైస్ఎంపీపీలు,వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - డి.హీరేహాళ్ : మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిపి పవిత్ర ఆధ్వర్యంలో, ఎంపీడీవో భాస్కర్ బాబు అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసన సభ్యులు కాపు రామచంద్రారెడ్డి ఆదేశాలు మేరకు మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ఎంపిపి పవిత్ర మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతి నిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల, గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు పాల్గొనాలని, ముందుస్తుగా రాబోయే వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి పరంగా ప్రతి గ్రామాలలో కూడ ప్రజా ప్రతినిధులు అందరూ ప్రజలకు ఇబ్బందీ కలగకుండా ఉండేందుకు కృషి చేయాలని కోరారు. ఏ గ్రామాల లో కూడా ఎటువంటి ఇబ్బంది సమస్య ఉన్నప్రజా ప్రతినిధులు అధికారులు తీసుకువచ్చి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళి చర్చించి సమస్య పరిష్కారం దిశగా ముందుకు వెళదామని కోరారు. అంతకు ముందు మొదటిసారిగా ఈ సర్వ సభ్య సమావేశానికి హాజరైన రాయదుర్గం మార్కెట్ యార్డు చైర్మన్ భోజ్ రాజ్ నాయక్‌ని మండల ఎంపిపి, వైస్ ఎంపిపి, ప్రజా ప్రతినిధులు అందరూ సాధారంగా ఆహ్వానించి స్వాగతం పలికి ఘనంగ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ ఎం.వన్నూరస్వామి, జెడ్పీటీసి హసీనా భాను, వైస్ ఎంపిపి బళ్ళారి లింగప్ప, మండల ఎంపిడిఓ భాస్కర్ బాబు, మండల డిప్యూటి తహసీల్దార్ బసవ కుమార్, లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఐకేపీ సిబ్బంది,పంచాయితీ సెక్రటరీలు, గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్లు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఓబుళాపురం మల్లికార్జున, రాళ్ల తిమ్మరెడ్డి,రుద్రేష్,పెద్ద అంజిని,పార్వతి, లక్ష్మి,బొమ్మన్న,పరమేశ్వేర, హను మంతరెడ్డి, నాగరాజు, గంగన్న,ఎంపీటీసీ సభ్యులు అనిత సురేష్, శివలింగ, ఏర్రి స్వామి, గోవిందు, సుజి మహేష్, తిప్పేస్వామి, నాయకులు తొండే వెంకటేశ్, హెచ్.కె. హనుమంతరెడ్డి, మల్లికార్జున, ఖాసిం పిర తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-ఉరవకొండ : ఓపెన్ ఇంటర్ చదవడానికి ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోపల వారి పేర్లను నమోదు చేసుకోవాలని ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మమత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని,విద్యార్థులకు 2023ఏప్రిల్ నెలలో పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొనా న్రు. జనరల్ విద్యార్థిని,విద్యార్థులు ఫీజు మొత్తం 2300 రూపా యలు చెల్లించాలన్నారు. అదేవిధంగాఎస్సీ,ఎస్టీ,బీసీ కేటగిరి విద్యార్థిని, విద్యార్థుల తోపాటు,అన్ని కేటగిరీల మహిళలకు రిజిస్ట్రేషన్ ఫీజు మొత్తం 2వేలు రూపాయలు చొప్పున చెల్లించాలని తెలిపారు. దీనిపై ఎవరికైనా అనుమా నాలు సందేహాలు ఉంటే ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యయన కేంద్రాన్ని లేదా జిల్లా కార్యాలయంలో గాని సంప్రదించాలని సూచించారు.

కార్యాలయంలో ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం

విశాలాంధ్ర - హిందూపురం : దేశంలోనే ఎక్కడా లేనివిధంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు పరిపాలన భాగ్యస్వామ్యం వైయస్ జగన్ పాలనలో సామాజిక న్యాయం జరిపారని, చట్టసభల్లో కూడా బడుగు బలహీన వర్గాలకు అత్యధిక శాతం కేటాయించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి అభినవ సంఘసంస్కర్త అని బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ విలేకర్ల సమావేశంలో కొనియాడారు. గతంలో రాజకీయ పార్టీలు బిసి అంటే బ్యాక్వర్డ్ క్యాస్ట్, నేడు సీఎం జగన్మోహన్ రెడ్డి బీసీ అంటే సమాజానికి బ్యాక్ బోన్ అని అర్థం చెప్పారు. టిడిపి జనసేన పార్టీలు తాము ఈ అభివృద్ధి చేస్తామని, మానిఫెస్టోలో చెప్పకుండా సీఎం జగన్మోహన్ రెడ్డిని సీఎం కాకుండా ఆపడమే లక్ష్యంగా కుయుక్తులు పన్నుతున్నారన్నారు.అందులో భాగంగానే ఎల్లో మీడియాతో పట్టాభి పై థర్డ్ డిగ్రీ అంటూ విష ప్రచారాలు చేస్తున్నారని, హాస్పిటల్లో ఉన్న పోలీసుల గురించి కూడా ఎల్లో మీడియా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ తోపాటు పలువురు కౌన్సిలర్లు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైల్వే డబ్లింగ్ ప్రాజెక్ట్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - ధర్మవరంటౌన్ : గుత్తి నుండి ధర్మవరం డబ్బింగ్ రైల్వే ప్రాజెక్ట్ పనులను సౌత్ సెంట్రల్ జోన్ కమిషనర్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ ప్రణ్ జీవ్ సక్సేనా ఆకస్మికంగా బుధవారం ధర్మవరంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే విభాగాలకు సంబంధించిన గుంతకల్ జంక్షన్ నుంచి వివిధ విభాగాల రైల్వే అధికారులతో పాటు, స్థానిక రైల్వే అధికారులు కూడా వారికి స్వాగతం పలుకుతూ ధర్మవరం నుండి కారులో చిగిచెర్ల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ఉండి మోటార్ ట్రాలీలో చిగిచెర్ల నుండి ధర్మవరం వరకు జరిగిన డబుల్ లైన్ పనులను ఉదయం 10గంటల నుండి రెండు గంటల వరకు క్షుణ్ణంగా పరిశీలించుకుంటూ వచ్చారు. అనంత రం అక్కడక్కడ చిన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి, సత్వరమే పరిష్కరించాలని వారు ఆదేశించారు. తదుపరి ధర్మవరం చేరుకున్న వారు వివిధ విభాగాల కార్యాలయాలతో పాటు రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం, సేఫ్టీ పనులపై కూడా దృష్టి పెట్టి అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడు తూ ఈ రైల్వే డబుల్ లైన్ పనులు నాణ్యతగా ఉన్నాయా లేదా అన్న వాటిపై తాను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని, నా తనిఖీ నివేదికను రైల్వే ఉన్నతాధికారు లకు తెలపడం జరుగుతుందని వారు తెలిపారు. త్వరలోనే డబుల్ లైన్ రైల్వే పట్టాలపై రైలు ప్రయాణం చేస్తాయని తెలిపారు. ప్రయాణీకులకు సౌకర్యంగా ఉండే విధంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా అన్ని చర్యలు చేపడు తున్నట్లు వారు తెలిపారు. ఈ డబుల్ రైల్వే పనులు పూర్తి కావడంతో ధర్మవరం ప్రజలకు మరింత సుఖ వంతమైన ప్రయాణం రైలు ద్వారా చేకూరుతుందని వారు తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కెవి రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్లకు సంబంధించిన వివిధ విభాగాల అధికారులు, స్టేషన్ మేనేజర్ నరసింహ నాయుడు, రైల్వే ఆర్పిఎఫ్ సీఐ బోయ కుమార్, రైల్వే జీఆర్పిసిఐ నాగరాజుతో పాటు స్థానిక రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఆయకట్లకి తాంబూలం అందించిన మండల కన్వీనర్

విశాలాంధ్ర-యాడికి : శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా గ్రామ పెద్దలతో ఆయ కట్టు వారితో బుధవా రం ఆలయఈఓ దుర్గా ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు హరి స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ బొంబాయి రామిరెడ్డి, ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ చేతుల మీదుగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆయకట్టు వారికి తాంబూలాలు సమర్పించి వారికి కేటాయించిన పనులను వారు సక్రమంగా నిర్వహించి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా పూర్తి చేయాలని వారు కోరారు. అనంతరం ఎస్ఐ మాట్లాడు తూ ఆనవాయితీగా సాగుతున్న బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఘర్షణలకు ఎలాంటి తావు లేకుండా కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని, లేనిపక్షంలో గొడవలు సృష్టించిన చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,ఎంపీటీసీ సభ్యులు బొంబాయి బ్రదర్ వెంకట నాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, మరియు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

అమ్మవారి దేవాలయానికి విరాళం

విశాలాంధ్ర - డి.హిరేహాళ్: మండల పరిధిలోని జజారుకల్లు గ్రామము నందు వెలసిన కెరమ్మ అమ్మ వారి దేవస్థానం నిర్మాణానికి తమ వంతు సహాయంగా దేవస్థానం ఆలయ కమిటి పెద్దలకు 5,000రూపాయిలు విరాళంగా అందిం చిన మండల ఎంపిపి పవిత్ర వన్నూరస్వామి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం చేపట్టడానికి తమ వంతు సహాయ,సహకారాలు ఎల్లప్పుడు ముందుంటామని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలోఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పనులు నిర్వహణ

విశాలాంధ్ర - విడపనకల్లు : మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో ఈనెల 24వ తేదీ సుంకల పార్వతి దేవి సందర్భంగా గ్రామ సర్పంచ్ బ్యాలారాణీ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఎంపిటిసిలు శివ, వేంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం పలు కాలనీలో పారిశుద్ధ్యం పనులు చేయించారు.

నిర్లక్ష్యంతో వాలంటీర్లకు అందని జీతాలు

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ మండలం నింబగల్లు, రేణమకుల పల్లి గ్రామాలతో పాటు వివిధ గ్రామాల వాలంటీర్లకు, గ్రామ కార్య దర్శులు యొక్క నిర్లక్ష్యంతో జీతాలు అందడం లేదని వాలంటీర్లు వాపోతున్నారు. బుధవారం కొంతమంది వాలంటీర్లు విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదని వాలంటీర్ల గౌరవ వేతనంకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నప్పటికీ కార్యదర్శుల జాప్యం వల్ల రావడంలేదని వాలంటీర్లు వాపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి జీతాలు మంజూరు అయ్యేలా కృషి చేయాలని వాలంటీర్లు పేర్కొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

విశాలాంధ్ర-గుంతకల్లు : జగనన్న కాలనీలో ఎల్పి నెంబర్ ఏడులో నీటి సమస్య మోటర్లు సమస్య అనేక సమస్యలు నెలకొన్నాయని తక్షణమే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు ప్రజానాట్యమండలి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్,పుల్లయ్య వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా జగనన్న కాలనీలో నివాసాల నిర్మాణానికి నీటి సమస్య విపరీతంగా మారిందన్నారు. అయితే నీటి బోరు మోటర్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. నిర్మాణాలు చేపట్టేందుకు బోర్లు రిపేరు చేసి నిర్మాణాలకు నీటిని అందించేందుకు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉమ్మర్ భాష తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-పుట్లూరు : గన్నవరం టిడిపి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేయడం దారుణమని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో సుదర్శన్ నాయుడు మాట్లాడుతూ గన్నవరంలో వైసీపీ నాయకులు టిడిపి కార్యాలయాన్ని కాల్చి వేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యాలయం కాల్చిన నిందితులను వెంటనే శిక్షించాలని, నిందితులను విడిచిపెట్టి టిడిపి నాయకులపైనే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని, పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. టిడిపి కార్యాలయం కాల్చిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రవిచంద్రనాయుడు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివశంకర్ రెడ్డి, తీర్థమయ్య, లక్ష్మయ్య, పెద్దయ్య, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర-రాప్తాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీచేసేందుకు వైసీపీ తరపున అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాలను ఇంచార్జి కలెక్టర్ కేతన్ గార్గ్‌కు బుధవారం అందజేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీ చరణ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. వైఎస్సార్సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సానిపల్లి మంగమ్మ నామినేషన్లు దాఖలు చేసిన సందర్భంగా రాప్తాడు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భూమిరెడ్డిని కలిసిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-గుంతకల్లు : రాయలసీమ పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి బుధవారం అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ నామినేషన్ లో పాల్గొన్న ఆయన్ను మర్యాదపూర్వకంగా టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ కృష్ణారెడ్డి, గుంతకల్లు టిడిపి యువ నాయకులు అనిల్ కుమార్ గౌడ్,టిడిపి నాయకులు తలారి మస్తానప్ప,కురుబ శివన్న లు కలిశారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, ఫిబ్రవరి 2023

మిల్లులో కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలి

విశాలాంధ్ర - హిందూపురం : ఏఐటీయూసీ కార్యదర్శి మారుతీ రెడ్డి అధ్యక్షతన ఏఐటీయూసీ కార్యాలయం నందు ఏఐటియుసి అనుబంధ ప్రీకాట్ 'బి' వర్కర్స్ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.బయన్న, జిల్లా నాయకులు కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, బాబు మాట్లాడుతూ, మిల్లు నందు కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు చేయడానికి ఏఐటియుసి కార్మిక సంఘం సిద్ధంగా ఉందని తెలిపారు. క్యాజువల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, న్యూ క్యాజువల్ వర్కర్లకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ప్రీకాట్ 'బి' వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాసులు, గంగాధర్, మాచప్ప, ముస్తఫా, వెంకటేష్, అశ్వత నారాయణ, అశ్వతప్ప, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ చలపతి, ఎఐటీయుసీ సీనియర్ నాయకుడు కృష్ణ , చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు వెంకటేష్, ఫక్రుద్దీన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కియా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండలంలోని దుద్దెబండ క్రాస్‌లోని కియా ఇండియా ట్రైనింగ్ సెంటర్‌లో సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న కియా ఇండియా ఆటో సర్వీస్ టెక్నీషియన్ ప్రోగ్రామ్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ, లీగల్ హెచ్‌ఓడి యోంగిల్ మా, టి అండ్ డి హెచ్‌ఓడి బైంగీ హన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ పై ప్రభుత్వం ఎంతగానో దృష్టి పెట్టిందన్నారు. జిల్లాలో ఉన్న ముఖ్యమైన పరిశ్రమలలో కియా ఇండియా ఒకటి అన్నారు. ఇక్కడ శిక్షణ అందించేందుకు కోసం మంచి క్లాస్ రూమ్, మంచి ఫ్యాకల్టీ, ల్యాబ్ అటాచ్డ్ ఉండే క్లాస్ రూమ్, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ శిక్షణ పొంది సరైన నైపుణ్యాలు నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా కూడా పనిచేసేందుకు వీలు కలుగుతుందన్నారు. పరిశ్రమరంగం చాలా మారిపోతుందని, ప్రతిరోజు కొత్త కొత్త కంపెనీలు ఏర్పడుతున్నాయని, కంపెనీలు కూడా నిలదొక్కుకునేందుకు మంచి ప్రోడక్ట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, చైనా, ఫ్రెంచ్ కంపెనీలు కొత్త టెక్నాలజీ తో వస్తున్నాయని, నిరుద్యోగ యువత నైపుణ్యాలలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. ఇలాంటి శిక్షణ తరగతుల్లో పాల్గొనేందుకు అందరికీ అవకాశం దొరకదని, మంచి శిక్షణ అందించి ఉద్యోగ భరోసా ఇచ్చి స్టైఫండ్ ఇవ్వడం కొద్ది మందికి మాత్రమే అవకాశం దొరుకుతుందన్నారు. శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇది మీ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందన్నారు. శిక్షణాకాలంలో 100 శాతం దృష్టి పెట్టి పూర్తి స్థాయిలో శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ మాట్లాడుతూ ఈ ఆటో సర్వీస్ టెక్నీషియన్ ప్రోగ్రామ్ ఆటోమొబైల్ సిస్టమ్‌లపై క్లాస్‌రూమ్ థియరీ మరియు హ్యాండ్-ఆన్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఈ అవకాశం ప్రతి ట్రైనీకి వారి ఉపాధిని పెంచుకోవడానికి వారి జ్ఞానాన్నిఉపయోగించుకోవడంలో సహాయపడుతుందన్నారు. కియా ఇండియా ఆటో సర్వీస్ టెక్నీషియన్ ప్రోగ్రామ్ కింద అనంతపురం, జిల్లాలో స్థానిక యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. 3 నెలల పాటు ఆటో సర్వీస్ టెక్నీషియన్ ప్రోగ్రాం కింద 100 మంది స్థానిక యువతకు ఆటోమొబైల్ సెక్టార్‌లో పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలతో శిక్షణనిస్తుందన్నారు. మొత్తం 55 లక్షల రూపాయల వ్యయంతో నాలుగు బ్యాచ్ లలో ఈ ప్రాజెక్టు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధి గాయత్రి వాసుదేవన్, తహసీల్దార్, సువర్ణ, స్థానిక ఉద్యోగులు నిరుద్యోగ యువత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎన్నికల అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోతుల నాగరాజు లను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పోతులయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సూర్య లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో బుధవారం పలు ప్రభుత్వ పాఠశాలలో ప్రచార కార్యక్రమాన్ని వారు నిర్వహించడం జరిగింది. కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజుల యొక్క వివరాలను తెలియజేసి,అందరికీ న్యాయం జరిగే విధంగా వారు చిత్తశుద్ధితో పనిచేస్తారని, అర్హులైన వారికే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వారు కోరారు. అధ్యాపక, ఉపాధ్యాయ, ఉద్యమ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, వీరు ఇరువురును ఎమ్మెల్సీగా గెలిపించుకొని, వారి సేవలను కొనసాగిస్తామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు కిషోర్, గణేష్, విజయ్, మురళి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినీలు చెడు అలవాట్లకు బానిసలు కాకూడదు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పాఠశాల విద్యార్థినీలు చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని, అలా జరిగితే చదువుకు పూర్తిగా ఆటంకం కలుగుతుందని వన్ టౌన్ ఏఎస్ఐ పుట్టప్ప, పాఠశాల హెచ్ఎం ఉమాపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణములోని సంజయ్ నగర్ లో గల బిఎస్సార్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు విద్యార్థినిలకు, చట్టం పైన, దిశా యాప్ పైన అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం ఏఎస్ఐ పుట్టప్ప, హెడ్మాస్టర్ ఉమాపతి మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే చదువుపై ఒక లక్ష్యమును ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసులు మౌనిక, హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు, 600 మంది బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంపై ఆందోళన

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలో ద్వారకామాయి నగర్లో గత నెలరోజులుగా విద్యుత్ అంతరాయంతో పనులు జరగక ఇబ్బందులు పడుతున్న ట్రాన్స్కో అధికారులు స్పందించక పోవడంపై ఆగ్రహం చెందిన చేనేత కార్మికులు సబ్ స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. గతంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్ పై ఓవర్ లోడ్ పడడంతో ట్రిప్ అవుతున్నాయని, దీనివల్ల సింగిల్ కరెంట్ రావడంతో మగ్గాలు నడవడం లేదని చేనేత కార్మికులు వాపోయారు. నెలరోజులుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి ట్రాన్స్కో ఇంజనీర్ సంజీవయ్య కు ఫోన్ చేస్తే మీకు పనిలేక ఇలా వస్తున్నారని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. విద్యుత్ సక్రమంగా వస్తావుంటే తాము ఎందుకు ఇలా వస్తామని ప్రశ్నించారు. తమకు సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసి సబ్ స్టేషన్ వద్ద బైఠాయించారు. విషయం తెలుసుకొన్న ట్రాన్స్కో ఏడి వారితో మాట్లాడుతు రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామనిహామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

విద్యాలయాన్ని దేవాలయంగా భావించండి

విశాలాంధ్ర-లేపాక్షి: విద్యాబుద్ధులు నేర్చుకుని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలను సాధించడమే కాకుండా విద్య నేర్పిన విద్యాలయాన్ని దేవాలయంగా భావించి సేవా భావంతో ముందుకెళ్లాలని స్పెషల్ ఆఫీసర్ నీలిమ విద్యార్థినిలకు సూచించారు.మండల కేంద్రమైన లేపాక్షి కస్తూరిబా విద్యాలయం నందు గురువారం మధ్యాహ్నం విద్యార్థినులు, ఉపాధ్యాయునులు ఘనంగా సరస్వతి పూజను ఘనంగా జరుపుకున్నారు. అయితే హిందూపురం నుండి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సాఫ్ట్వేర్ శ్రీధర్ గౌడ్, భగీరవటెక్స్ టైల్స్ నిర్వహకులు నవీన్, కమిటి సభ్యులు చంద్ర, ఆంజప్ప తదితరులు పాల్గొని విద్యార్థినులకు చదువులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

డ్రైనేజ్ నిర్మించాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు: బీసీ కాలనీ సమీపంలోనే వేణుగోపాల నగర్లో డ్రైనేజీ కాలువని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సిద్ధారెడ్డిని ఆకాలనీ ప్రజలు బుధవారం కోరారు. బీసీ కాలనీలోనే ఇళ్ల నుండి వచ్చే మురికి నీరు, వర్షపు నీరు, ఊట నీరు ఇళ్ల ముందరే నిలువ ఉంటున్నందున విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని అన్నారు. నివాసము ఉండటానికి కూడా ఇబ్బందికరంగా ఉన్నదన్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు తెలిపిన కూడా పట్టించుకున్న వారే లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ డ్రైనేజీ కాలువను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరారు.

తారకరత్న 40వ జయంతి

విశాలాంధ్ర - చెన్నేకొత్తపల్లి : రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రముఖ సినీనటుడు కీర్తిశేషులు నందమూరి తారకరత్న 40వ జయంతిని పురస్కరించుకుని తారకరత్న మిత్రుడు అవుకు హరి ఆధ్వర్యంలో స్థానిక ఎలిమెంటరీ స్కూళ్లలో సుమారు 100 మంది విద్యార్థులకు ఒక నోటు పుస్తకం, పెన్ను , పెన్సిల్ మరియు బిస్కెట్ ప్యాకెట్ ను పంపిణీ చేశారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఉన్న స్కూళ్లలోని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తారకరత్న అభిమానులు పాల్గొన్నారు.

తిన్నారు...వెళ్లిపోయారు

- అభివృద్ధి పేరెత్తని అధికారులు
- నిమిషాలలో ముగిసిన సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-లేపాక్షి: గడచిన కాలంలో జరిగిన పనులు అందులో ప్రజలకు ఉపయోగపడిన అభివృద్ధి ఏదని చర్చించాల్సిన సభలో భవిష్యత్తు నెలలకు జరగాల్సిన అభివృద్ధి సంక్షేమాన్ని మాట్లాడాల్సిన అధికారులు ప్రజాప్రతినిధులు మసాలా వడలు తిని సమయం కాలయాపన చేయడమే కాకుండా నిమిషాల వ్యవధిలోనే సమావేశం ముగించేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా మాట్లాడవలసి ఉండగా ఒకటి రెండు శాఖలు మాత్రమే ఆ శాఖల గురించి వివరించగా మిగిలిన శాఖ అధికారులు మాత్రం అవకాశం ఇవ్వకపోవడంతో అక్కడే వారి స్థానాల్లోనే కూర్చుండి పోయారు. అదితి పిలుపుతో వచ్చిన సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్ రెడ్డి మాత్రం వచ్చి రాగానే అధికార వేదిక మీద కూర్చొని మండల స్థాయి అధికారులతో రావాల్సిన బిల్లులు భవిష్యత్తులో జరిగే పనులపై ఘాటుగా ఆరా తీయడంతో అక్కడున్న కొంతమంది ప్రజాప్రతినిధులు అధికారులు వేదికపై కూర్చొని అధికారం లేకపోయినా అధికార బలంతో వేదిక పైనుండి మాటలు మాట్లాడటం ఎంతవరకు సమన్వయం అని చర్చించుకోవడం గమనార్హం మండల వ్యాప్తంగా 13మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి మాత్రం 5 మంది హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యల పైన చర్చ జరిపి పనులు పూర్తి చేయాల్సిన ప్రజాప్రతినిధులు రాకపోవడమే కాకుండా హాజరైన వారైనా కనీస సమస్యలు రేషన్ కార్డు పెన్షన్ మౌలిక వసతులు గ్రామీణ ప్రాంతాల్లోని సిమెంట్ ల రోడ్ల నిర్మాణం సంక్షేమ పథకాలు అందని వారి సమస్యలు తదితర అంశాలను మాట్లాడాల్సిన ప్రజా ప్రతినిధులు మౌనంగా ఉండి పోయారు. అయితే అభివృద్ధిపై శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అధికారులు కూడా తెల్ల కాగితాలు చేతిలో పట్టుకుని అడిగితే చెబుదాం లేదంటే వెళ్ళిపోదాం అనే విధంగా నడుచుకోవడం మండల అభివృద్ధికి వెనకడుగు వేసినట్లేనని అక్కడే ఉన్న ప్రజాప్రతినిధులు కిందిస్థాయి అధికారులు గుసగుసలాడడం జరిగింది. మూడు నెలలకు ఒకసారి వచ్చే ఇలాంటి సమావేశాలలో సమస్యలను పరిష్కరించుకోకపోతే నమ్మిన వేలాదిమంది ప్రజలకు ఏ సమాధానం చెప్పుకుంటారు. అయితే అన్ని శాఖలు హాజరుకావాలని ఆదేశాలు ఉన్నప్పటికీ కొన్ని శాఖల హాజరవ్వడం రానివారి పట్ల ఎలాంటి చర్యలు కూడా తీసుకోకపోవడం ఎంతవరకు జరుగుతుందో వేచి చూడాల్సిందే సమావేశం ముగిసే సమయంలో ఎంపీడీవో నరసింహనాయుడు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ సమావేశంలో జరిగిన పనుల గురించి మాట్లాడడమే జరుగుతుందని ప్రత్యేక తీర్మానాలకు అవకాశం లేదన్నారు. వైస్ ఎంపిపిలు అంజన్ రెడ్డి నీలావతి సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు ట్రాన్స్కో ఏఈ వెంకటేష్ ఎంఈఓ నాగరాజు నాయక్ ఏవో శ్రీలత డాక్టర్ వెంకట చిరంజీవి శాఖల వారీగా అధికారులు పాల్గొన్నారు.

నూతన జడ్జ్‌కు సన్మానం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: గత నాలుగు సంవత్సరాలుగా ధర్మవరం కోర్టులో ఉమర్ ఫరూక్ న్యాయవాది వృత్తిని చేస్తూ ఇటీవలే నూతన జడ్జ్ ఉమర్ ఫరూక్ పదవి బాధ్యతలను చేపట్టబోతున్న సందర్భంగా ధర్మవరం కోర్ట్ బార్ అసోసియేషన్ వారు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ చౌదరి, కార్యదర్శి దస్తగిరి,ఉపాధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ ఉమర్ ఫరూక్ న్యాయవాదై వృత్తిని చేస్తూ, తనదైన శైలిలోకక్షీ దారులకు న్యాయాన్ని చేకూరుస్తూ, కోర్టులో కూడా మంచి గుర్తింపు పొందా రనీ వారు తెలిపారు. ఉమర్ ఫరూక్ ఇష్టంతో కష్టపడి, లా విద్యలో మరింత ప్రావీణ్యతను చూపిస్తూ, ఇటీవల జడ్జ్ ఎగ్జామ్స్ లో ప్రతిభ ఘనపరిచి, ఎంపిక కావడం జరిగిందన్నారు. ఎన్నో సివిల్, క్రిమినల్ కేసులను వాదిస్తూ విజయాన్ని కూడా సాధించడం జరిగిందన్నారు. అనంతరం నూతన జడ్జిగా చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలం మండలంలోని కోర్టులో పదవీ బాధ్యతలు గురువారం స్వీకరిస్తున్న సందర్భంగా బార్ అసోసియేషన్ తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అందరూ కూడా ఉమర్ ఫరూక్ ను ఘనంగా సత్కరించుట, మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ధర్మవరం నుండి జడ్జిగా ఎంపిక కావడం కోర్టుకు ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేత ఎంటీఎస్ జట్టు

విశాలాంధ్ర-మడకశిర: గత పది రోజులుగా మండల పరిధిలోని సి. కొడిగేపల్లి గ్రామంలో కంపెనీ సెక్రటరీ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జిల్లాస్థాయి వైయస్సార్ టి 10 మెమోరియల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసాయి. ఇందులో భాగంగా ఫైనల్ లో మడకశిర ఎంటీఎస్ జట్టు రొల్ల ఫ్రెండ్స్ జట్టుపై 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.మొదట బ్యాటింగ్ చేసిన మడకశిర ఎంటీఎస్ జట్టు నిర్ణిత 15 ఓవర్లలో 78 పరుగులు లక్ష్యాన్ని రొళ్ల జట్టు ముందు ఉంచింది. అయితే లక్ష్య చేదనలో తడబడ్డ రోళ్ల జట్టు మడకశిర బౌలింగ్ దాటికి వికెట్లు పేక మేడల కుప్పకూలాయి. అయితే ఈ మ్యాచ్లో బౌలర్లు ఆధిపత్యం చలాయించడంతో రోళ్ల జట్టు నిర్ణీత ఓవర్లలో 70 పరుగులకు ఆల్ ఔట్ అయింది.ఫైనల్లో విజయం సాధించిన మడకశిర ఎంటీఎస్ జట్టు కెప్టెన్ తిమ్మారెడ్డికి మాజీ ఏపీసిసి చీఫ్ రఘువీరారెడ్డి ట్రోఫీ తో పాటు లక్ష రూపాయల నగదు బహుమానాన్ని అందించారు.అదేవిధంగా రన్నర్ గా నిలిచిన రొల్ల జట్టుకు ట్రోఫీతో పాటు 50 వేల రూపాయల నగదు బహుమానాన్ని అందించారు. టోరీ మొత్తం అత్యద్భుతంగా బౌలింగ్ చేసి 16 వికెట్లు తీసిన హరీష్ రెడ్డికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది.ఫైనల్ మ్యాచ్ విజయానికి కీలకపాత్ర పోషించిన నాగు యాదవ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును టోర్నమెంట్ నిర్వాహకుడు సురేష్ రెడ్డి అందించారు.ఈ సందర్భంగా మాజీ ఏపీ సి సి రఘువీరారెడ్డి మాట్లాడుతూ యువకులకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉంటుందని ఈ క్రీడలు ఎప్పుడు స్నేహపూర్వకంగా ఉండాలనే విషయాన్ని మర్చిపోకూడదని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత అనిల్ కుమార్ రెడ్డి,చిలమత్తూరు సర్పంచ్ రామచంద్ర రెడ్డి,నాయకులు శాలిని సుధాకర్ రెడ్డి,మంజునాథ్ రెడ్డి, చెరుకూరు సర్పంచ్ శేఖర్ రెడ్డి,సునీల్ కుమార్ రెడ్డి,చిన్న నర్సప్ప భరత్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణమును కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్ : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మజీర మండలానికి చెందిన 36సంవత్సరాలు కలిగిన కంసల కావ్య ను బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య యత్నం చేస్తుండగా, డయల్100 ద్వారా వచ్చిన కాల్ మేరకు వన్టౌన్ పోలీసులు సకాలంలో కావ్య ప్రాణాన్ని కాపాడి, మానవతను చాటుకున్నారు. వివరాలను సిఐ సుబ్రహ్మణ్యం తెలియపరుస్తూ కంశల కావ్యతో పాటు 11 సంవత్సరాల బన్నీ అనే బాలుడు, తొమ్మిది సంవత్సరాల అప్పు అనే బాలిక తన కుటుంబంలోని ఆస్తి తగాదాల విషయంలో తన సంతానానికి తీవ్ర నష్టం అవుతుందన్న బాధతో ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అనంతరం తన కుటుంబ తగాదాలను, పిల్లల భవిష్యత్తును ఆలోచన చేస్తూ, తనకు ఎవరు న్యాయం చేయార ని, దిక్కు లేదని, ఇక నాకు చావే శరణ్యమని అనుకున్నదని తెలిపారు. తదుపరి ఇద్దరు పిల్లలను ఒక ప్లాట్ఫారం అరుగు మీద తన సెల్ఫోన్ ఇచ్చి కూర్చోబెట్టి, తాను చావు బోతున్నానని సమాచారమిచ్చి, రైల్వే పట్టాలపై వెళ్లిపోయింది అని తెలిపారు. కొడుకు అయిన బన్నీ తన తెలివితో డయల్ 100కు కాల్ చేశాడని, ఆ డయల్ నెంబర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు సమాచార అందగా, తాను సిబ్బందిని సకాలంలో పంపడం జరిగిందని తెలిపారు. వన్ టౌన్ కానిస్టేబుల్ రాజప్ప టూ టౌన్ కానిస్టేబుల్ ఉపేంద్ర హుటాహుటిన రైల్వే స్టేషన్ కు చేరుకొని కొడుకు సమాచారంతో రైలు పట్టాలపై పరుగులు తీశారు. ఆ సమయంలో ఏ రైలు రాకపోవడంతో కంసల కావ్యాను ప్లాట్ఫారం వైపుకు తెచ్చి తగిన కౌన్సిలింగ్లను ఇవ్వడం జరిగిందన్నారు. తదుపరి సిఐ కావ్యాకు జరిగిన కుటుంబ తగాదాలను, ఆస్తి తగాదాలను విని, తగిన న్యాయం అధికారుల ద్వారా చేస్తానని తెలిపి పంపించడం జరిగిందని తెలిపారు. మొత్తం మీద ఓ నిండు ప్రాణాన్ని కాపాడుతూ ,ఇద్దరు పిల్లల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టిన సిఐ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ రాజప్ప, ఉపేంద్ర లను పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాల్మీకులకు ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల హర్షం

విశాలాంధ్ర-కొత్తచెరువు: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాల్మీకులను గుర్తించి స్థానిక సంస్థ పోటాల్లో రెండు ఎమ్మెల్సీల పదవులకు ఎంపిక చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి శంకర్, ఎల్లప్ప, పెయింటర్ కేశవ, ఆవుల రాము తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి మంగమ్మ కర్నూలు జిల్లాకు చెందిన డాక్టర్ మధుసూదన్ కు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో అశోకు,మురళి,అసత్తు,చింతకాయల అసహ్యతప్ప,కిష్టప్ప,కృష్ణమూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ

విశాలాంధ్ర - హిందూపురం : లేపాక్షి మండలం కేజీబీవీ పాఠశాల, కళాశాల విద్యార్థులకు స్థానిక హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం 120 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ ఇవ్వాలని సంకల్పంతో, బుధవారం కేజీబీవీ బాలికల పాఠశాలలో పంపిణీ ప్రిన్సిపాల్ నీలిమ అధ్యక్షతన పంపిణీ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు సాఫ్ట్ వేర్ ఇంజినీర్ శ్రీధర్ గౌడ్ , భగీరథి టెక్స్ టైల్స్ నవీన్ చంద్ర, కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజప్ప మాట్లాడుతూ, గత ఎనిమిది సంవత్సరాలుగా బాగా చదువుకునే విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు సరస్వతి పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈవీఎంలు ఉంచడానికి గోదాన్ల పరిశీలన

విశాలాంధ్ర-కొత్తచెరువు: 2024లో జరిగే రాష్ట్ర శాసనసభ పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతున్నందున ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నందున వాటిని నిలువ ఉంచడానికి మార్కెట్ యార్డ్లోని గోదాన్ని జాయింట్ కలెక్టర్ చేతన్, పుట్టపర్తి ఆర్డిఓ భాగ్య రేఖ బుధవారం పరిశీలించారు. నూతనంగా శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పడినందున జిల్లావ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నందున ఈవీఎంలు భద్రపరచడానికి వాటిని ఆయన పరిశీలించారు. ఈ గోడౌన్ ను నిర్మాణము పూర్తి కాకపోవ డంతో మరమ్మత్తులు నిర్వహించి తమకు అప్పగించాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస రెడ్డిని కోరారు. ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరిస్తానని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ రామాంజనేయ రెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి, సర్వేయర్ సురేష్,వీఆర్వోలు వేణుగోపాల్,శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరమును సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని సుందరయ్య నగర్ లో గల గణేష్ మున్సిపల్ హై స్కూల్ ఆవరణములో ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు 29వ వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత బాల్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కౌన్సిలర్ సుజాత బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరమును పేద ప్రజల కొరకై నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో గుండెనొప్పి, చాతినొప్పి, గుండె దడ,ఆయాసము, కళ్ళు తిరగడం, గుండెలో మంట కలగడం, చాతి బరువుగా ఉండడం,కాళ్లు వాపు రావడం ,చెమటలు పట్టడం లాంటి సమస్యలకు వైద్య చికిత్సలను అందించబడునని తెలిపారు. అంతేకాకుండా ఈ శిబిరంలో బిఆర్బిఎస్/ బీపీ/ ఈసీజి/ 2డి ఎకో పరీక్షలను కూడా ఉచితంగా చేయబడునని తెలిపారు. ఈ శిబిరములో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ ఆరోగ్యమును కాపాడుకోవాలని వారు కోరారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: నికర జలాల పరిరక్షణ కొరకు ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు నిర్వహించబడే మహా పాదయాత్ర ప్రజాప్రదర్శనను జయప్రదం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు అశోకవర్ధన్ రెడ్డి, సీమ కృష్ణ ,అంకాల రెడ్డి-టీచర్, రామకృష్ణారెడ్డి -కవి,భూషణ్ ,తదితర విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్పందన ఆసుపత్రి ఆవరణములో డాక్టర్ బషీర్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. కావున ఈ పాదయాత్రను ప్రజా ప్రదర్శనలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

శివాజీ విగ్రహ భూమి పూజకు తరలిరండి

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రం లో స్థానిక లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26ఆదివారం చత్రపతి శివాజీవిగ్రహ ఏర్పాటు భూమి పూజ కార్యక్రమానికి మండల ప్రజలు విరివిగా హాజరుకావాలని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి పరిపూర్ణానంద విచ్చేయుచున్న సందర్భంగా ఉదయం 10 గంటలకు సుగురు ఆంజనేయస్వామి దేవాలయం నుండి మేలాపురం వరకు బైక్ ర్యాలీ శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుంది. కమిటీ సభ్యులు రమణ ,అగ్గి శ్రీనివాసులు ,ప్రవీణ్ చిన్న,రంగనాథ్, రామకృష్ణారెడ్డి,జి.మహేష్ ,బి.శ్రీనివాసులు ,లక్ష్మణమూర్తి, నరేష్ ,నాగేంద్ర ,మంజు ,సురేష్ ,సుధీర్ ,వెంకటేష్ స్థానిక యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలో నక్కలగుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రం ను జాయింట్ కలెక్టర్ చేతన్ బుధవారం సందర్శించారు. ఆ గొడెన్ పొడవు వెడల్పు విస్తీర్ణాన్ని అధికారులతో అడిగి తెలుసుకున్నాడు. ఆ కేంద్రానికి రావడానికి రహదారి సౌకర్యం సరిగా లేదని వెంటనే రహదారి సౌకర్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కొల్లప్ప, తాహసిల్దార్ మురలీకృష్ణ, డిప్యూటీ తాహసిల్దార్ శ్రీకాంత్, వీఆర్వో అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టండి

విశాలాంధ్ర-పుట్టపర్తి : చట్ట వ్యతిరేక కార్యకలాపా పైన ప్రత్యేక దృష్టి సాధించాలని సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్కు వచ్చే పిటీషనర్స్ పట్ల మర్యాదగా వ్యవహరించి త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను కట్టడి చేయడంతో పాటు ఈ నేరాల్లో వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఫోక్సో, తదితర కేసుల్లో అలసత్వం ఉండరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్, ఎస్ బి డీఎస్పీఉమ మహేశ్వర రెడ్డి, పుట్టపర్తి డి.ఎస్.పిటిడి యశ్వంత్ ,కదిరి డి.ఎస్.పిభవ్య కిషోర్, పెనుకొండ డిఎస్పిహుస్సేన్ పీరా, జిల్లా లోని ఇతర సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



వైఎస్సార్ లా నేస్తం... 20 మంది లబ్ధి

విశాలాంధ్ర-పెనుకొండ: వైఎస్సార్ లా నేస్తం పథకం 2022 కింద 20 మంది అర్హులైన యువ న్యాయవాదులకు 15,35,000 రూపాయల నగదును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, ఏ జి పి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో 'వైఎస్ఆర్ లా నేస్తం' నిధులను ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది.మొత్తం 2,011 మంది జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేలు చొప్పున రూ.1 కోటి మొత్తాన్ని.. సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. యువ న్యాయవాదులకు లా నేస్తం ద్వారా నెలకు రూ.5 వేలు చొప్పున మూడున్నరేళ్లలో తాజా నిధులతో కలిపి.. 4,248 మందికి రూ.35.40 కోట్లు ఆర్థిక సాయం ప్రభుత్వం అందించిందని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం కోసం కార్పస్ ఫండ్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.